క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.25,100 విరాళం



విరాళం అందజేస్తున్న కేదార్‌నాథ్, చింతపల్లి మీనాక్షి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కేదార్‌నాథ్, చింతపల్లి మీనాక్షి ఆదివారం రూ.25,100 విరాళం అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేద పండితులు ఆశీర్వచనం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జూలియస్‌రాజు

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లె పంచాయతీ ఆర్పీ అగ్రహారంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆషా సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ చోట్ల ఐదు తాగునీటి బోర్లను ఏర్పాటు చేసి, నీటి సమస్య పరిష్కారానికి వారు తమ వంతు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య సలహాదారు అమ్ములురాజు, అనిల్, భారతి తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్ట్‌కి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్‌కి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన శ్రీనివాసులు(25) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా సీతారాంపేట సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కొత్తవీరాపురం స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

సంక్షేమమే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



చేమూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మహిళల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం తొట్టంబేడు మండలం చియ్యవరం సచివాలయం పరిధిలోని చేమూరు, చేమూరు దళితవాడ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలతోపాటు అవ్వ, తాతలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యేకు ప్రజలు అపూర్వ సాగతం పలికి, బ్రహ్మరథం పట్టారు. సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతి గడపలో ప్రజలు హారతులు పడుతూ పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేని ఆహ్వానించారు. దుష్ట చతుష్టయం ఎన్ని ఆరోపణలు చేసిన 2024లో జగనన్నకు మళ్లీ అండగా ఉంటామని ప్రజలు భరోసా కల్పిస్తున్నారు. ఎమ్మెల్యే జగనన్న నవరత్న పథకాలను ప్రజలకు వివరిస్తూ, అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు వెంటనే ఆ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. గ్రామంలోని కొంత మంది తమకు పింఛన్లు రద్దు చేశారని ఫిర్యాదు చేయగా వాటి పరిశీలించి, వెంటనే సమస్యను పరిష్కరించారని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అర్చనాదేవి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, సీఐ విక్రమ్, నాయకులు మునిరత్నం, మోహన్ నాయుడు, హరి నాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యుడు వేమలయ్య, గురవారెడ్డి, చలపతి, శేఖర్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, గంగారామ్‌రెడ్డి, మురళి, విజయ్, మునిరాజరెడ్డి, సుబ్బయ్య, కోటేశ్వరరెడ్డి, రమణయ్య, గాలి బాలాజీ నాయుడు, వేంకటేశ్వర్లు నాయుడు, గోపి, భాస్కర రెడ్డి, అలంకార్, వెంకటేశ్వర్లు, రఘురాం, ఢిల్లీ బాబు, భక్తవత్సలం, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

శ్రీకాళహస్తిరూరల్: తూర్పు రాయలసీమ (చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని శ్రీకాళహస్తి మండల జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని శెనగలమిట్ట, రెడ్డిపల్లె, వేలవేడు, మాధమాల, గంగలపూడి, ఎర్రమరెడ్డిపల్లె, పాతగుంట, సూరావారిపల్లె, మంగళగుంట, తిమ్మవరం, ఎంపేడు, ఈశ్వరయ్యకాలనీ తదితర గ్రామాల్లో పట్టభద్రులను కలసి వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు గత రెండు వారాల నుంచి ప్రతి గ్రామానికి వెళ్లి పట్టభద్రులను కలసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ప్రచారంలో పట్టభద్రులను కలసినప్పుడు వారి నుంచి మంచి స్పందన వస్తుందని హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించిందని అన్నారు. సచివాలయాల్లో ఉన్న 14 వేల ఖాళీలను భర్తీ చేయటానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జలదంకి మదన్‌మోహన్ రెడ్డి, వైస్‌ఎంపీపీ అక్కుపల్లి భానుమూర్తి యాదవ్, గుణశేఖర్‌రెడ్డి, చేమూరు సురేష్, రామచంద్రారెడ్డి, చంద్రారెడ్డి, వెంకటరమణయ్య, శంకర్‌యాదవ్, ప్రసాద్‌యాదవ్, శేఖర్‌యాదవ్, సుబ్రమణ్యంయాదవ్, కృష్ణయ్యయాదవ్, పాపయ్యయాదవ్, వెంకటేష్ యాదవ్, వెంకటరత్నం యాదవ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఎమ్మెల్యే ఇచ్చిన రూ.10 వేలు ఆర్థిక సాయం నగదును స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అమ్మపాళెం దళిత కాలనీలో వైస్సార్ సీపీ మహిళా కార్యకర్త పిల్లి చెంగమ్మ(59) కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. చెంగమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈ సమాచారాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన అమ్మపాళెం దళితకాలనీకి చేరుకుని, చెంగమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. తరువాత చెంగమ్మ దహనక్రియలకు రూ.10 వేలు సాయం అందజేశారు. ఆయన వెంట కందాటి ఈశ్వర్‌రెడ్డి, కందాటి యుగంధర్‌రెడ్డి, రఘుకేశవరెడ్డి, చంద్రారెడ్డి ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



శ్రీకాళహస్తి: పట్టణంలోని పెద్దమసీదువీధిలో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా మాట్లాడుతూ తాము 130 నెలలుగా కులమతాలకతీతంగా పేదలైన దివ్యాంగులకు క్రమం తప్పకుండా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ఇంకా ఎక్కువ మందికి సాయం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కంఠా ఉదయ్‌కుమార్, మల్లీశ్వరి, కొల్లూరు హరినాయుడు, బాబా ఫరీద్, శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రత్యేక ఆహ్వానితులు పవన్, హెల్పింగ్‌హ్యాండ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సచివాలయంలో మంగళవారం ఉద్యోగ మేళా జరుగుతుందని సర్పంచ్ లలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీసిటీ, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని కర్మాగారాల్లో ఖాళీగా ఉన్న మహిళా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హనుమంతునిపై వీరరాఘవస్వామి



ఊరేగుతున్న వీరరాఘవస్వామి

నారాయణవనం: మండల కేంద్రంలోని వీరరాఘవస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు హనుమంత వాహనంపై పురవీధుల్లో విహరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన చక్రస్నానంతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించిన అర్చకులు ప్రత్యేక వేద పారాయణం చేశారు. 9 గంటలకు పెద్ద హనుమంత వాహనంపై వీరరాఘవస్వామివారిని కొలువుదీర్చి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. మహానైవేద్యం అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పట్టుశాలియులు, స్థానికులు పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటలకు చక్రత్తాళ్వార్‌కు అభిషేకాలు చేసి, చక్రస్నానం నిర్వహించారు. దీంతో వార్షిక ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వీఎంపల్లెలో ప్రెస్‌క్లబ్, ఎంజీఎం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యశిబిరంలో సుమారు 300 మంది పాల్గొని, వైద్యసేవలు పొందారు. వైద్యులు, రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ సహకారంతో పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉందన్నా రు. రానున్న రోజుల్లో ప్రెస్‌క్లబ్‌తో కలిసి మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు ఇన్‌చార్జి పసల సురేష్, ట్రస్టుబోర్డు సభ్యురాలు సుమతి, నాయకులు రమణయ్య, రామచంద్రయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే కల్లుగీత కార్మికులకు నిజమైన భరోసా

శ్రీకాళహస్తి: కల్లుగీత కార్మికులకు భరోసా ఇచ్చి, వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీకాళహస్తి కల్లుగీత కార్మికుల తరఫున అధ్యక్షుడు కావలి గోపిగౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం గీత కార్మికులను పట్టించుకోలేదన్నారు. గీత కార్మికులకు అండగా నేనున్నాను అంటూ భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రికి, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ గీత కార్మిక భరోసా పథకం ద్వారా రాష్ట్రంలో 95,245 మంది కల్లుగీత కార్మిక కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రతి సంవత్సరం వందల మంది గీత కార్మికులు కల్లు గీస్తూ ప్రమాదానికి గురవుతున్నారని, అందులో దాదాపు 40 శాతం మంది మృతి చెందుతున్నారన్నారు. అలాంటి వారిని గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రమాదబీమా రూ.10 లక్షల పరిహారం ప్రమాదాల బారిన పడిన గీత కార్మికుల కుటుంబాలకు ఎంతో ఉపయోగంగా ఉందని చెప్పారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయాధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, అమరావతి సీసీఎల్‌ఏ కమిషనర్ లక్ష్మీనరసింహం వేర్వేరుగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్ర, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, సుదర్శన్, కిషోర్‌రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న సర్పంచ్

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లెలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం సర్పంచ్ పెంచలయ్య ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్ 15 రోజులుగా నిర్వహించారు. టోర్నమెంట్‌లో 64 జట్లు పాల్గొన్నాయి. చిందేపల్లె, దుర్గిపేరి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. దుర్గిపేరి జట్టు విన్నర్‌గా చిందేపల్లె జట్టు రన్నర్ నిలిచాయి. విన్నర్ జట్టుకు జ్ఞాపికతోపాటు రూ.10,016 నగదు, విన్నర్ జట్టుకు రూ.5,016 నగదును అందజేశారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు గిరి, తిరుమల, ఢిల్లీ, లోకేష్, సుబ్రమణ్యం, వెంకటయ్య, మధు, చలపతి పాల్గొన్నారు.

ఆ పల్లె.. ప్రగతి మల్లె

పులివల్లంలో నిర్మించిన సీసీ రోడ్డు





నాడు-నేడు పథకంలో అధునాతన వసతులతో నిర్మించిన పులివల్లం ప్రాథమిక పాఠశాల భవనం



పులివల్లంలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు

ఓటేసిన పల్లెవాసులకు న్యాయం చేయాలన్నదే ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యం. ఆ దిశగా సర్కారు ముందడుగు వేసింది. అభివృద్ధి పనులకు రూ.కోట్ల నిధులు మంజూరు చేసింది. ఫలితంగా వరదయ్యపాళెంలోని పులివల్లం గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పుడక్కడ కాలికి మట్టి అంటని సీసీ రోడ్లు.. రక్షిత మంచినీటి పథకం.. డంపింగ్ యార్డు.. అధునాత వసతులతో పాఠశాల దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ గ్రామంలో ప్రగతి మల్లెలు విరబూస్తున్నాయి.

- పులివల్లంలో అభివృద్ధి పరుగులు
- రూ. 1.20కోట్లతో పలు పనులు

వరదయ్యపాళెం: ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడున్నరేళ్లగా 300 గృహాలు, వెయ్యి మందికి పైగా జనాభా ఉన్న ఆ పంచాయతీలో రూ. 1.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అదే వరదయ్యపాళెం మండలంలోని పులివల్లం పంచాయతీ. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గ్రామ అభివృద్ధికి, ప్రజల అవసరాలకు ప్రభుత్వ ప్రభుత్వం పెద్దపీట వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి ఇలా..

- స్థానిక ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.17 లక్షల వ్యయంతో 20 వేల లీటర్ల హైలెవల్ వాటర్ ట్యాంకును నిర్మించారు. దానికి అనుసంధానంగా రూ.6 లక్షల వ్యయంతో 3 తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు.
- గ్రామంలోని వీధుల్లో రూ.18 లక్షల వ్యయంతో 400 మీటర్ల మేరకు సిమెంటు రోడ్లు నిర్మించారు.
- స్థానిక ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రూ. 22లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను నిర్మిస్తున్నారు.
- కారిపాకం ప్రధాన మార్గం నుంచి బీఎస్‌పేటకు వెళ్లే పంచాయతీ రోడ్డుకు రూ. 30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం జోరుగా సాగుతోంది.
- రూ. 4.60 లక్షలతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సేకరించిన చెత్తను నుంచి సంపద సృష్టికి డంపింగ్ యార్డ్ నిర్మిస్తున్నారు.
- రూ. 3 లక్షలతో తాగునీటి అవసరాలకు 800 మీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేశారు.
- స్థానిక ప్రభుత్వ పాఠశాలను నాడు-నేడు పథకం ద్వారా రూ. 20 లక్షలతో నూతన హంగులతో అభివృద్ధి చేశారు.

సీసీ రోడ్లు నిర్మించారు



గతంలో ఎన్నడూ లేని విధంగా పులివల్లంలోని వీధులు సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చెందాయి. గత ప్రభుత్వంలో నీటి సమస్య గురించి అనేకసార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. స్థానిక సర్పంచ్ చొరవ.. ప్రభుత్వ సహకారంతో గ్రామం అభివృద్ధి చెందుతోంది.

– నాగయ్య, పులివల్లం గిరిజనకాలనీ, వరదయ్యపాళెం మండలం

తాగునీటి సమస్య తీరింది



గ్రామంలో నూతనంగా హైలెవల్ ట్యాంకు నిర్మించి 3 బోర్లను ఏర్పాటు చేయడంతో స్థానికంగా నెలకొన్న తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. గత ప్రభుత్వంలో నీటి సమస్య గురించి ట్యాంకు నిర్మాణం కోసం అనేకసార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. అభివృద్ధికి సహకరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటాం.

– చెల్లమ్మ, పులివల్లం

అందుబాటులోకి రానున్న వైద్యం



మా ఊరిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం నిర్మాణం జరుగుతోంది. ఈ భవనం త్వరలోనే పూర్తికానుండడంతో వైద్యసేవలు మాకు అందుబాటులోకి రానున్నాయి. గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా సూళ్లూరుపేట, తడ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మించి మా ఆరోగ్యాలకు భరోసా ఇచ్చిన ప్రభుత్వానికి అండగా నిలుస్తాం.

– లక్ష్మమ్మ, పులివల్లం

అభివృద్ధి వైపు పులివల్లం



పులివల్లం పంచాయతీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదరణతో పలు అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. సీసీ రోడ్ల నిర్మాణం, హైలెవల్ వాటర్ ట్యాంకు, తాగునీటి బోర్లు ఏర్పాటు చేశాం. నిర్మాణ దశలో ఉన్న పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం. ఇంకొన్ని అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– బాలకృష్ణ, సర్పంచ్, పులివల్లం పంచాయతీ

ట్రాఫిక్ ఇక్కట్లు



బుచ్చినాయుడుకండ్రిగలో రోడ్డుపై ఆపి ఉన్న వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌జామ్‌తో మండల ప్రజలు, వాహనచోదకులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఆటోవాలాలు రోడ్డుకు అడ్డంగా ఆటోలు ఉంచడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని వాహనాలుచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని మండల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

పది లిథియం అయాన్ బ్యాటరీ తయారీ కేంద్రాలు



దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న అమరరాజ చైర్మన్ జయదేవ్

రేణిగుంట: విద్యుత్ వాహనాల కోసం రాష్ట్రంలో అమరరాజ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో 10 లిథియం బ్యాటరీ తయారీ యూనిట్లను నెలకొల్పినట్లు ఆ సంస్థ చైర్మన్ గల్లా జయదేవ్ తెలిపారు. దావోస్‌లో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఆయన పాల్గొని, భారతదేశంలో పారిశ్రామిక రంగ వృద్ధి, అవరోధాలపై విశ్లేషించారు. కోవిడ్ దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా పలు వ్యాపార సంస్థలు కుప్పకూలిన పరిస్థితుల్లో నాణ్యమైన ఉత్పత్తులను అందించే కంపెనీలో సమర్థవంతంగా విపత్తును ఎదుర్కొన్నాయన్నారు. మరిన్ని పెట్టుబడులను భారతదేశం ఆకర్షించడానికి ఉన్న మార్గాలపై చర్చించారు. భారతదేశం స్వీయ సమృద్ధి సాధించేందుకు ఉన్న అవకాశాలను గురించి, కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, అశ్వని వైష్ణవ్, ఆర్కే సింగ్, మన్‌సుఖ మాండవీయలకు వివరించారు. ఇంధన సంక్షోభం చిక్కులను గురించి మాట్లాడారు. తాజా అంతర్జాతీయ సవాళ్లు.. భారతఖ్యాతి మరింత పెరిగే పరిస్థితులు తాను దావోస సదస్సులో చూశానన్నారు. భారతదేశం నుంచి పలు అగ్రగామి కంపెనీ ప్రతినిధులు కూడా ఈ సదస్సులో పాల్గొన్నట్లు ఆయన వివరించారు.